
# మైడియర్ భర్తా




"అరే భాయ్! మనం పుట్టింది అనుభవించటానికి. జల్సాగా బ్రతకటానికి" అన్నాను.

"కాదు మనిషి పుట్టింది మంచి పనులు చేయటానికి.... జల్సా అనేది నీలాటివారికి ఆనంద్" రామం బొంగురు స్వరంతో అన్నాడు.

మౌనంగా సిగరెట్ పీలుస్తూ కూర్చున్నాను.

"అరె ఆనంద్। యీ ఒక్కసారికి సాయం చేయరా ప్లీజ్!" రామం బ్రతిమిలాడుతూ అడిగాడు

నేనేం మాట్లాడలేదు.

యిరువురం ఒకే జాబ్ వెలగపెడుతున్నాము. బల్ల కింద చెయ్యి పెడితే యీజీగా తడుస్తుంది.

రామంగాడి దృష్టిలో అది చాలా నీచంట,

నిజం చెప్పాలంటే....ఈ దేశంలో చేతగాని వెధవలే శ్రీరంగ నీతులు వల్లిస్తుంటారు.

పిల్లలు తల్లిదండ్రులను పోషించాలని ఎక్కడవుంది? భారతంలో వుందా? బైబిల్‌లో వుందా? ఖురాన్‌లో వుందా? లేక ఎథిక్స్ అండ్ సెక్స్ పుస్తకాల్లో వుందా? అంతా హంబక్.

రెక్కలు వచ్చిన పక్షులు ఎగిరిపోతాయి అవి వాటి ధర్మం.

పిల్లలు కావాలని అఘోరించినందుకు... పిల్లలకు రెక్కలు వచ్చిందాకా పెంచి పెద్ద చేయటం తల్లిదండ్రుల ధర్మం.

ఎవరికి ఎవరు అని....ఏనాడో నా బోటివారు చెప్పేపెట్టారు.

బల్లకింద చేతులు పెడుతున్నాను. ఇంట్లో వాళ్ళు మరీ ఏడ్చిపోతారని పాతికో పరకో పంపుతున్నాను. మనిషిగా పుట్టినందుకు ఖాళీగా గడిపేస్తున్నాను, జీవితాన్ని. యిది ఎంతమాత్రం తప్పుకాదు.

మరి రామం....? తనని తన తల్లితండ్రులు కష్టపడి పెంచారుట అందుకని వచ్చిన జీతంలో తగు మాత్రం వుంచుకొని మొత్తం జీతం రెండో తారీకు ఉదయమే తల్లితండ్రికి పంపేస్తున్నాడు.

ఒకరోజు ఆగితే ఏంపోయింది. నేను జీతం తీసుకున్న పదిరోజుల తరువాత పంపించటం లేదూ.

వాళ్ళు అక్కడినుంచి డబ్బు అర్జంటు అనగానే అప్పుకు బైలు దేరుతాడు. బల్లక్రింద చేతులు పెట్టడం తప్పుట, అప్పుచేయటం తప్పుగాదుట.

"ఆనంద్, ఏమిటిరా ఆలోచన, అత్యవసర పరిస్థితిరా యిది." నాచేతులు పట్టుకు కుదిలిస్తూ అన్నాడు రామం.

ఏదో కఠినంగా జవాబు యివ్వబోయి నోరు తెరిచాను. బయట నుంచి "పోస్ట్" అన్న కేక వినపడింది.

నాకన్నా ముందు రామం లేచి వెళ్ళి పోస్ట్‌మెన్ ఇచ్చిన కవరు అందుకుని... భక్తిగా నా చేతిలో పెట్టాడు.

అది వాసవి దగ్గరనుంచి.

ఆతృతగా చించి చదివాను. "గుడ్ న్యూస్, గుడ్ న్యూస్." ఆనందంగా పైకి అరచాను. ఆ సంతోషంలో ఓరేయ్ రామం వంద కావాలన్నావుగా ఇదిగో తీసుకోవోయ్ అని ఇచ్చాను.

అనుకోని యీ హటాత్ పరిణామానికి రామం ఆశ్చర్యపోయాడు.

మళ్ళీ మాట్లాడితే నోటు లాక్కుంటానేమో అనుకుని శలవు పుచ్చుకుని తొందర తొందరగా వెళ్ళి పొయ్యాడు రామం.

వాసవి వ్రాసిన లెటర్ మరోసారి చదువుకుంటూవుండి పొయ్యాను.

డియర్ ఆనంద్‌బాబూ

నీ లెటర్ అందుతూనే రిప్లయి యిస్తున్నాను ఎందుకో తెలుసా? ఉహూ నే చెప్పంది తెలుసుకోలేవు, అవునా? నీకు ఆనందం కలిగించేది. మన యిరువురికీ సంబంధించినది, ఆ విషయం.

పెన్ ఫ్రెండ్‌గా మనం యిరువురం స్నేహం మొదలుపెట్టి సరీగా యీ రోజుకు సంవత్సరం నిండింది.

ఆదివారం అంటే యీ నెల పదో తారీకు నేను నీ ముందు రెక్కలు కట్టుకు వాలుతాను. పెన్ ఫ్రెండ్స్ - ముఖాముఖిగా కలవబోతున్నాం తమాషాగా లేదూ!

స్నేహితురాలు రమణి మ్యారేజ్ మీ వూళ్ళో జరుగుతున్నది. సోమవారం మ్యారేజి. అందుకని ఆదివారం మెయిల్‌లో సెకండ్‌క్లాస్ కంపార్టమెంట్‌నించి దిగి నీ ముందు ప్రత్యక్షమవుతాను. ఆదివారం నీ రూమ్‌లో వుండి మనమనసులు విప్పుకుని మాట్లాడుకొని. యిరువురం ఏకాభిప్రాయానికి వస్తే పెద్దలకు తెలియపరచి పెళ్ళాడుదాము.

మనం యింతవరకూ ఒకరి నొకరం చూచుకోలేదు కాబట్టి నీవు చేతిలో గులాబి పట్టుకునిరా, గుర్తుపడతాను. నేను వైట్‌డ్రస్ వేసుకొని తలలో మందార పువ్వుతో దర్శన మిస్తాను. ముద్దమందార వాసవి అని గుర్తు తెలుసుకో.

ఆదివారం, పది, మరచిపోకు. మిగిలిన సంగతులు నీ సన్నిధానంలో...

ఇట్లు

నీ వాసవి.

"అబ్బ, వాసవి, ఎంత చక్కని పేరు ముత్యాలలాంటి అక్షరాలు, ముద్దైన మాటలు

ఆదివారం యింకా నాలుగు రోజులు వుంది. అబ్బ, నాలుగు రోజులు.

వాసవి ఎలావుంటుందో? లెటర్స్‌లో వ్రాసిన వర్ణన అయితే చాలా చక్కనిది అవుతుంది" వాసవి గురించి రాబోయే ఆదివారం గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను.

నాలుగురోజులు గడచిపోయ్యాయి. ఆదివారం కొత్తపెళ్ళి కూతురులా సిగ్గుపడుతూ వచ్చింది.

మెయిల్ రావటానికి మూడు గంటల టైమ్‌వుంది. నీటుగా తయారై స్టేషనుకు వెళ్ళాను.

ఉదయం నుంచీ రూమ్ సర్దటంవల్ల నా రూమ్‌కు కళవచ్చింది మరో గంట తరువాత నేనూ వాసవి ఆ రూమ్‌లో కాలు పెడితే యింకా కళకళలాడిపోదూ!

గులాబి పూలు అమ్మే చోటికి వెళ్ళాను. పదిపైసలు అంటే పావలా పారేసి పెద్ద గులాబీరంగు గులాబీ పువ్వు తీసుకున్నాను.

పావలా యిచ్చినందుకు పూలమ్మి

"మంచిబాబులు, చల్లగా వుండాలి" అంది.

రైల్వే స్టేషన్ చేరాను.

మెయిలు గంట లేటుట బుర్రమీసాల స్టేషను మాష్టరు చిరాకుగా చెప్పాడు పీడిముఖం తుమ్మల్లో పొద్దు కూకినట్లుంది. వీడి పెళ్ళాం వీడితో కాపురం చేయటం అసంభవం. మనసులో వాడికన్నా చిరాకుగా అనుకున్నాను.

రెండు ఎక్స్ప్రెస్‌లు, మూడు ప్యాసింజరులు వచ్చి వెళ్ళాం తరువాత మెయిల్ వచ్చింది, రొప్పుతూ రోజుతూ....

చేతిలో గులాబీ పాంట్ జేబులో దాచేశాను. సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్‌కు కాస్త దూరంగా నుంచున్నాను కన్నె మందార కోసం కళ్ళు ఆర్పకుండా చూస్తూ.

లెటర్స్‌లో వ్రాసినట్లు వాసవి అందంగా ఉండకపోతే వెనుతిరిగి పోవడానికి నిశ్చయించుకున్నాను.

ముద్దమందార తళుక్కుమంది సెకండ్‌క్లాసు కపార్టుమెంట్ గుమ్మం దిగుతూ.

"బ్యూటీక్వీన్, తను వ్రాసిన దానికన్నా అందగత్తెకాస్తంతలావు, తెలుపు"

"పాంట్ జేబులో పువ్వు పదిలంగా చేతిలో పట్టుకుని ఎదురేగాను."

"వాసు" అన్నాను.

వాసవి తలఎత్తి చూచింది చటుక్కున.

"నేను నీ ఆనంద్‌బాబుని, యిదిగో గుర్తు గులాబీ పువ్వు నీవు చెప్పినట్లే చేశాను. అన్న ప్రకారం తలలో మందార పెట్టుకున్నావు. లేకపోతే గుర్తుపట్టటం ఎంత కష్టం ?" అన్నాను గుక్కతిప్పుకోకుండా.

చిన్నగానవ్వింది. మల్లెలు విచ్చినట్లు.

"బైటకు వెళదాంపద" అంటూ బైటకుదారితీశాను,

తనదగ్గరనుంచీ లెటర్ అందుకుంటూనే తనెంత ఆనందం పొందినదీ, ఈ రోజుకోసం ఎంత ఆరాటంతోఎదురు చూచిందీలెటర్‌లోరైటింగ్‌చూస్తూనేఏవిధంగా ప్రేమించిందీవగైరాలు వీలయినంతగట్టిగా మనసుకు హత్తుకుపోయేటట్లు చెప్పాను.

వాసవి నన్ను ఆశ్చర్యంగా చూస్తూ నేను చెప్పిన ప్రతిమాటా అత్యంత శ్రద్ధతో వింది.

ఆడదాన్ని నమ్మించలేని మొగవాడు ఏం మొగవాడు. ఎలా మొగవాడు అవుతాడు ?

"వాసూ ఏమిటా మూగనోము,"

అన్నాను. అప్పటిదాకా వాసవి మాట్లాడనట్టు గుర్తుకు వచ్చి.

"మీరు నన్ను మాట్లాడనిస్తేగా ?" చిరుకోపంతో అంది.

"మీరు, చారు, ఆనంద్ అని పిలు." అన్నాను కాస్త అధికారం ప్రదర్శిస్తూ,

తూనీగ (ఆటోరిక్షా) ఎక్కి రూమ్ ముందుదిగాము, నూత్న వధూవరుల లాగా.

"కుడి కాలుపెట్టు." అన్నాను గుమ్మం చూపిస్తూ.

"చాదస్తం మొగుడు" ముద్దుగా అంది వాసవి.

వాసవి నీ పెన్ ఫ్రెండ్ కావచ్చు. నీ వంటే పడిచావొచ్చు.

కాని ఆడపిల్ల ఆడబుద్ధి జాగ్రత్తగా ఉండాలి " అనుకున్నాను.

మనసు వూరుకుంటుందా ? దాని దసలే కోతిబుద్ధి. తొందర పడకూడదు. మాటి మాటికీ హెచ్చరిక చేసుకున్నాను.

కులాసా కబుర్లు అయిపోయాయి. భోజనంరూమ్‌కేతెప్పించుకుతిన్నాము.

పెళ్ళికి వాళ్ళవాళ్ళు ఎవరూ అభ్యంతరం చెప్పరు. అంది

నేనూ అదే మాట చెప్పాను.

"మరో గంటవుండి వెళ్ళిపోతాను." అంది వాసవి.

"అదేం. రేపుకదా, మీ ఫ్రెండ్ మ్యారేజీ, నా రూమ్‌లో వుంటానని వ్రాశావుగా ?" గాభరాగా అన్నాను.

"ఎవరైనా చూస్తే....?" కాసేపు ఆలోచించి అంది.

"ఎవరికీ తెలియదు, ఈ రాత్రి వృధా చేయకు అన్నాను.

"ఛా - ఛా. భయం " అంటూనే నవ్వింది - సరేనన్నట్లుగా.

ఆ నవ్వు మతి పోగొట్టింది. అప్పటికి సగం మతి పోయివున్నాను. అంతే వాసవిని బలంగా దగ్గరకు లాక్కున్నాను.

"పెళ్ళి అయిందాకా వద్దు ఆనంద్." అంది చిన్నగా.

"ఎలాగూ పెళ్ళి అవుతుంది." అన్నాను ఇప్పుడు వద్దు అంటున్నది. కాని.... శరీరం దూరం చేసుకోటానికి ఏమాత్రంప్రయత్నించలేదు.

వాసవిని నా సొంతం చేసుకున్నాను స్వర్గ సుఖం చూస్తూ....

ఆరాటి తొందరగా తెల్లవారి శని లాగా సోమవారం వచ్చింది.కొంపమునిగినట్లు.

"నువ్వు పెళ్ళివారింటికి రావద్దు ఆనంద్ నేను ఒక్కదాన్నీ వెళతాను. యిద్దరినీ చూస్తే ఎవరైనా అనుమానిస్తారు. నన్ను అన్యాయం చేయవు కదూ ?" అంది.

నా అడ్రస్ మారింది. పెళ్ళి విషయం వెంటనే రాయి. అంటూ కొత్త అడ్రస్ ఇచ్చింది.

వాసవి వెళ్ళిపోయింది. నన్ను విడచి వెళ్ళలేక వెళ్ళలేక.

పెళ్ళిచూసుకొని ఆ రాత్రికే వెళ్ళి పోతానంది.

నాలుగు రోజులు గడచిపోయాయి. వాసవికి లెటర్ వ్రాయటం మొదలు పెట్టాను.

మిస్. వాసవీ.

నేను ఆనంద్‌ను లెటర్ వ్రాస్తున్నాను. డార్లింగ్, డియర్, అనేవాడివి. మిస్ అంటున్నానని ఆశ్చర్య పోతున్నావా ? అది అంతే మిస్ వాసవీ.

నీ లెటర్ ప్రకారం యిద్దరం కలుసుకున్నాము. బాగుంది. మనసులు విప్పి మాట్లాడుకున్నాము మరీ బాగుంది. కాని జరిగింది ఏమిటి ?

అందరి ఆడపిల్లలగా భయ పడక ఇష్ట పూర్వకంగా నిన్ను నీవు అర్పించుకున్నావు. శీలంఅంటే ప్రాణం అనుకునే యువతి నీలాగా పరాయి మొగాడికి శరీరము అర్పించదు.

నేనంటే యిష్టం అయితే మటుకు నేను కోరంగానే చెరువవుతావా? గట్టిగా వద్దని మాట మాత్రం అన్నావా?కావాలని ప్రోత్సాహ మిచ్చావు, ఆడదానికి అంత కోరిక వుండకూడదు.

సరి అయిన ఆడది. పరిధిదాటి అంగుళం ముందుకురాదు. మరి నీవు చేసింది ఏమిటి ?

నా సంగతి అంటావా ? తుమ్మెద మగవాడు ఒకటే వాళ్ళకు కొన్ని హక్కులు వున్నాయి. అవి వాళ్ళకు చెరుపు చెయ్యవు. మొగవాడిలా మాత్రమే నేను ప్రవర్తించాను. అది నా తప్పుకాదు.

నేను మొగవాడిని ఎలాగో. నా మగ మనసు కోరికా అదే, అదేమిటీ అంటావా ?

నన్ను పెళ్ళాడబోయే యువతి కన్యాత్వం చెదరదనిదై వుండాలి. భయంతో నన్ను ఆరాధిస్తూ దూరంగా వుండాలి. ఆ యువతి నా భార్యగా పనికి నస్తుంది. పెళ్ళికాకుండానే కోరిక అపుకోలేక నా వడిలో వాలావు. రేపు నిన్నే పెళ్ళాడి ఏదో పని వుండి పక్కవూరు వెళితే అదే కోరికతో కళ్ళుమూసుకుని ప్రవర్తించవని ఎలా నమ్మను ? ఇక మనిద్దరి స్నేహం ఆపేద్దాం.

ఆ రాత్రి అంతులేని ఆనందాన్ని ఫ్రీ గా అందించినందుకు థాంక్స్. అన్నట్లు థాంక్స్ చెప్పటం అనవసరమేమో అంతకు రెట్టింపు ఆనందాన్ని ఎలాగూ పొందావుగదా ? యిదే చివరి లెటర్.

నీకు ఏమీకాని
ఆనంద్.

లెటర్ వ్రాయటంముగించి గర్వంగా నవ్వుకున్నాను

పెళ్ళి అంటూ యిహ నా దగ్గరకు రాదు. సిగ్గులేకుండా ఎలావస్తుంది లెటర్ చదువుతూనే సగం చస్తుంది. పెళ్ళిళ్ళ, ప్రేమట, పిల్లలు, భార్య, సంసారం, ఫూల్స్‌చేసేపని, నాపని ...

రాణీ, మృదుల, కాంత, రమణి ఎవరూ నోరెత్తలేదు. యీ వాసవి ఎత్తుతుందా ? పెళ్ళికాకుండా తనువును అర్పించుకునే అమ్మాయిలు. తప్పుచేసినట్లు సగం చస్తారు. అల్లరిచేస్తామంటే సొంతం చస్తారు. ఫూలిష్‌గరల్స్, ఆ రాత్రి అందరికన్నా ఎక్కువ ఆనందం అందించింది వాసవి, అలా అని తాళికట్టటం ఛా .. ఛా బుద్ధిలేని పని.

లెటర్ వ్రాసేశానుకదా, ఇంకా ఆలో చన దేనికి. మరచిపోని పెన్ ఫ్రెండ్." అనుకున్నాను సిగరెట్ వెలిగించు కుంటూ.

కవరు పోస్టులో పడేశాను ఆరోజే.

మరో నాలుగు రోజులు గడిచి పోయ్యాయి.

వాకిట్లో "పోస్టు" కేక వినపడింది

"వాసవికాదు!" వణకుతున్న చేతు లను బిగపట్టుకొని కవరు అందుకు న్నాను పోస్టుమేన్ చేతిలోంచి.

ఫ్రం అడ్రస్‌లేదు.

కవరు చించాను. కాగితం క్రైట పడింది.

వాసవి రైటింగ్‌కాదు. "అమ్మయ్యా" భారంగా నిట్టూర్పు విడిచాను.

లెటర్ చదవటం మొదలుపెట్టాను. ఆతృతగా....

డియర్ రాజా ఆనంద్.

నే నెవరో మీ రెరుగరు. మీరు తెలుసుకోకపోవడమే మంచిది. ఆరోజు రైలులో సెకండ్‌క్లాస్ కంపార్టుమెంటు నుంచి దిగాను. నా తలలో మందార రైలులో ఒకామె యిస్తే పెట్టుకున్నాను. అది చూచి నీ ప్రియురా లనుకున్నావు.

ఇహ నా కథ చెబుతాను పెళ్ళాం కోర్కెలు తీర్చలేనివాడు నా భర్త. అందుకే అందరి భార్యల్లా అణిగి మణిగి ఉండలేకపొయ్యాను. ఫలితం నా భర్త కంటపడటం,అచ్చమైన భర్తలాగా కొట్టి తిట్టి తాళిలాక్కొని రెండు చీరెలు నా ముఖానకొట్టి పో పుట్టింటికి" అని వాకి ట్లోకి నెట్టాడు ముఖ్యమైన కథయింతే.


ఆ తరువాత కథ రైలుదిగి రావ టంతో మొదలైంది. నన్ను చూచిన ఆనందంలో నేనే వాసవి ననుకున్నావు. అందిన సమయాన్ని వృథాచేయటం యిష్టంలేక కథ అర్థంచేసుకోని జాగ్ర త్తగా మెలిగాను. పాపం ఆ వాసవి అదృష్టం నీదగ్గరకు రాలేదు. నీవుపరమ నీచుడివి. అవసరానికో ఆడదాన్ని కోరేవాడివి.

ఆడదంటే నీ దృష్టిలో లోకువ. మొగాడిననే గర్వం,

నేను ఎలాంటి ఆడదానినో, నీవు అలాంటి మొగవాడివే. ఏదోఎధంగా కోరికతీరాలి, తరువాతసంగతి అవతలి వాళ్ళ సంగతి నీకనవసరం.

నా పెళ్ళికాకముందు నీలాంటి వెధవ మాటవిని లొంగాను. చూస్తూ చావలేక పెళ్ళాడాను ఆ వెధవనే. పెళ్ళానికి కోరికలు వుండకూడదు, మొగుడికే వుండాలి. మొగమహారాజును నా యిష్టం వచ్చినట్లు తిరుగుతాను అనేవాడు పెళ్ళానికో న్యాయం మొగుడికో న్యాయం, అదిచూచి సహించలేక ఎవరి విష యంలోనయినా న్యాయం ఒకటే సుమా అని రుజూచేశాను ఫలితంమాట దేవు డెరుగు,

అందరూ నాలాగా వుండరు. అలా




వున్ననాడు మీలాంటి వాళ్ళకి బుద్ధొచ్చేది. క్షమించే భార్యలు వుండబట్టే నీలాంటి వారు బ్రతికి బట్టకడుతున్నారు.

ఈ సోది అంతా ఎందుకంటావేమో కసి. సమాజంమీద కసి మొగాళ్ళ (నీబోటి) మీద కసి అందుకు.

పెళ్ళికాకముందే వాసవి నీకులొంగింది కాబట్టి యిహ నువ్వు చస్తే వాసవిని పెళ్ళాడవు. నీ మొగతనం అందుకు ఒప్పుకోదు

మైడియర్ ఫూల్, ఆరోజు రాత్రి నీదగ్గరుంది వాసవికాదు. ఈ నిజం నీవు తెలుసుకుని ఏడ్చిపోవాలి. నా చేతిలో ఫూల్‌వయినందుకు సిగ్గుపడు.

మొగవాడివని గర్వించే మీలాంటి ఫూల్స్ ఒక విషయంలో ఆడదాని దగ్గర లొంగిపోతారు. ఆ విషయంలో నిజంగా నీవు ఫూల్‌వి అయావు.

యీ సంగతి తెలియచెయ్యటానికే యీ ఉత్తరం.

ఇట్లు,

వాసవినికాని నేను!

